సాక్షి నల్లగొండ

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



ఎన్నికల ఖర్చు రూ.60 వేలే

తొలిసారి నా ఎన్నికల ఖర్చు రూ.60 వేలే వచ్చిందని మాజీ మంత్రి గుత్తా మోహన్‌రెడ్డి తెలిపారు.

- IIలో



సరిహద్దులో నిరంతరం నిఘా

రాష్ట్ర సరిహద్దుల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు సూర్యాపేట, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు తెలిపారు.

- IVలో



దివ్యాంగుల సంక్షేమానికి కృషి

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు.

- IVలో

న్యూస్‌రీల్

జిల్లాకు వచ్చిన ఎన్నికల వ్యయ పరిశీలకులు

నల్లగొండ: కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఐఆర్‌ఎస్ అధికారులు డీఎం.నిమ్జే, ఎంఆర్.సతీష్ గురుమూర్తి గురువారం నల్లగొండ జిల్లా కేంద్రానికి వచ్చినట్టు జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ తెలిపారు. డీఎం నిమ్జే నాగార్జునసాగర్, మిర్యాలగూడ, సతీష్ గురుమూర్తి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ చేయనున్నారని పేర్కొన్నారు. నిమ్జే 8977054651, సతీష్ గురుమూర్తి 8143880650 ఫోన్ నంబర్లలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా నారాయణరెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: డీసీఎంఎస్ చైర్మన్ వట్టి జానయ్యయాదవ్‌పై అనర్హత వేటు పడడంతో వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి గురువారం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా నాగార్జున సహకార మార్కెటింగ్ సొసైటీని ఆర్థికంగా బలోపేతం చేయడానికి తనవంతుగా కృషి చేస్తానని ఈ సందర్భంగా నారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్షయవ్యాధి నివారణ అందరి బాధ్యత



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న క్షయ నివారణ అధికారి కల్యాణ్ చక్రవర్తి

మాడుగులపల్లి: క్షయ వ్యాధి నివారణ అందరి బాధ్యత అని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి అన్నారు. మాడుగులపల్లి మండలం పాములపాడు ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయన క్షయ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎడతెరిపి లేని దగ్గు ఉన్నా.. దగ్గినప్పుడు తెమడలో రక్తం పడడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా పౌష్టికాహారం, చికిత్సకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. 131 మంది శిబిరానికి హాజరు కాగా వీరిలో 37 మందికి ఛాతీ ఎక్స్‌రే, 17 మంది సీబీ నాట్ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సంజయ్ కుమార్, కార్తీక్, పబ్లిక్ హెల్త్ నర్స్ జయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రాణి, ఆరోగ్య విద్యాధికారి ఫయాజ్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నల్లగొండ రూరల్: ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని తెలంగాణ జనసమితి (టీజేఎస్) పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, శ్రీధర్ పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాయన్నారు. రాష్ట్రంలో గ్రూప్–2 పరీక్ష పేపర్లు అమ్ముకునట్లు ఆరోపించారు. బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు యాదయ్య, పాపయ్య, క్రాంతి, నర్సిరెడ్డి, కిరణ్‌కుమార్, మల్లేశం, వీరా నాయక్, సైదా తదితరులు పాల్గొన్నారు.


17న జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు

నల్లగొండ: ఈ నెల 17న జిల్లాస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాల పరిధిలోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ నెల 13 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రిపోర్టులో జూనియర్లు 2,500 పదాలు, సీనియర్లు 3,500 పదాలు ఉపయోగించాలని సూచించారు. ప్రధానంగా పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం సంరక్షణ కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు, స్వీయ విశ్వాసం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం, సాంకేతిక ఆవిష్కరణ నుంచి ఏదో ఒకదాన్ని ప్రాజెక్టుగా ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి సెల్ : 9848578845 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొత్త ఓటుకు 91,023 దరఖాస్తులు



దురాజ్‌పల్లి(సూర్యాపేట), నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కొత్త ఓటరు నమోదుకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. అక్టోబర్ 31వ తేదీన గడువు ముగిసే నాటికి 12 నియోజకవర్గాల్లో 91,023 మంది కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. వీటిలో ఇప్పటికే కొన్నింటిని అధికారులు ఓకే చేశారు. మిగిలిన వాటిని పరిశీలించిన అనంతరం అనుబంధ జాబితాలో చేర్చనున్నారు. దీంతో ఓటర్ల సంఖ్య పెరగనుంది.



31తో ముగిసిన గడువు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 18 ఏళ్ల వయస్సు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ క్రమంలో ఓటు నమోదుకు మరో అవకాశం కల్పించింది. నూతన ఓటు నమోదుకు అక్టోబర్ 31 వరకు అవకాశం ఇచ్చింది. గడువు ముగిసే నాటికి సూర్యాపేట జిల్లాలో ఫాం–6కు 27,037 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు 13,535 దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన 12,176 నూతన ఓట్లకు అనుమతించారు. ఇంకా 13,502 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 19,957 రాగా 17,667 అర్హత పొందాయి. 2,290 దరఖాస్తులను తిరస్కరించారు. నల్లగొండ జిల్లాలో 44,029 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 19375కు ఓకే చేశారు. మిగతావి పరిశీలిస్తున్నారు.

ముహూర్తం చూసి..

నేటి నుంచి నామినేషన్లు

- మంచి రోజులు చూసుకుంటున్న అభ్యర్థులు
- 9వ తేదీన ఎక్కువ మొత్తంలో దాఖలు కానున్న నామినేషన్లు
- నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్ల స్వీకరణకు చండూరులో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 10వ తేదీవరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా రంగంలోకి దిగుతున్న అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు బలమైన ముహూర్తం చూసుకుంటున్నారు. తిథి, వారం, నక్షత్రం చూసుకొని తమకు కలిసి వచ్చే రోజు ఏదని తెలుసుకొని మరీ నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నేతలతోపాటు ఇతర పార్టీల వారు ఎక్కువ మంది ఈ నెల 9వ తేదీనే నామినేషన్లు వేయనున్నట్లు తెలుస్తోంది. గురువారం ఏకాదశి కావడంతో ఆ రోజునే ఎంచుకుంటున్నారు.

అభ్యర్థుల నామినేషన్ల ముహూర్తాలు ఇలా..

- **నల్లగొండ :** బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్ రెడ్డి 9న నామినేషన్ వేయనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకటరెడ్డి 7వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు.
- **నకిరేకల్ :** కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం 9వ తేదీన నామిషన్ దాఖలు చేయనుండగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య ఇంకా నిర్ణయించుకోలేదు. 9 లేదా 10వ తేదీన వేసే అవకాశం ఉంది.
- **మిర్యాలగూడ:** బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు 9వ తేదీన నామినేషన్ వేయనున్నారు. కాంగ్రెస్, సీపీఎం అభ్యర్థులు ఖరారు కాకపోవడంతో ఏ రోజున నామినేషన్ వేస్తారనేది స్పష్టత లేదు.
- **సూర్యాపేట:** బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి 9వ తేదీన నామిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావు 10న, బీఎస్పీ అభ్యర్థి జానయ్య యాదవ్ 9వ తేదీన నామినేషన్ వేయనున్నారు.
- **తుంగతుర్తి:** బీఆర్‌ఎస్ అభ్యర్థి కిషోర్, బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య 9వ తేదీన నామినేషన్ వేయనున్నారు.
- **కోదాడ:** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతిరెడ్డి 7న, టీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ 9వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు.
- **మునుగోడు:** బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి 9న నామినేషన్ దాఖలు చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 10వ తేదీన నామినేషన్ వేయనున్నారు.
- **దేవరకొండ:** బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్ 4 లేదా 9వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్ 4 లేదా 8వ తేదీన నామినేషన్ వేయనున్నారు.
- **హుజూర్‌నగర్:** బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇద్దరూ 9వ తేదీనే నామినేషన్ దాఖలు చేయనున్నారు.
- **ఆలేరు:** బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత 4వ తేదీన, కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య 9వ తేదీన, బీజేపీ అభ్యర్థి పడాలశ్రీనివాస్ 10వ తేదీన నామినేషన్ వేయనున్నారు.



- **నాగార్జునసాగర్:** బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్ 9వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. బీజేపీ అభ్యర్థి కంకణాల నివేదితారెడ్డి 4న లేదా 9 లేదా 10వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జయవీర్‌రెడ్డి 9 లేదా 10వ తేదీన నామినేషన్ వేస్తారు.
- **భువనగిరి:** బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి 4న తొలిసెట్, 9న మరోసారి నామినేషన్ వేయనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి 8వ తేదీన నామినేషన్ వేయనున్నారు. బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి 3వ తేదీన తొలి సెట్, 10వ తేదీన రెండో నామినేషన్ వేయనున్నారు.

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి చేశాం : కలెక్టర్



మాట్లాడుతున్న కర్ణన్, పక్కన ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ: అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని, అదే రోజు నుంచి స్వీకరించే నామినేషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఎస్పీ అపూర్వరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 10వ తేదీ శుక్రవారంతో పూర్తవుతుందన్నారు. నవంబరు 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ 3వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు.

మొత్తం 1,766 పోలింగ్ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,766 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో యావరేజిగా 819 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఈసారి ఆరు నియోజకవర్గాల పరిధిలో ఒక్కో నియోజకవర్గంలో ఐదు చొప్పున 30 మహిళా పోలింగ్ స్టేషన్లతోపాటు మరో 30 మోడల్, 6 యూత్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. 521 సమస్యాత్మకంగా పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వాటి పరిధిలో భద్రతకు కేంద్ర బలగాలను నియమించామన్నారు. అలాగే అభ్యర్థులు, పార్టీలు చేసే ఎన్నికల ఖర్చు వివరాల పరిశీల, నమోదుకు ప్రత్యేక మానిటరింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఎఫ్‌ఎస్‌టీ 21, ఎస్‌ఎస్‌టీ 13, ఎంసీసీ 43, వీఎస్‌టీ 8, ఏఈఓ 7, ఏటీ 6, వీవీటీ 6 టీమ్‌లు ఉన్నాయని తెలిపారు.

ఎన్నికల విధులకు 10,177 మంది సిబ్బంది..

ఎన్నికల నిర్వహణ కోసం పీఓలు 2,034 మంది, ఏపీఓలు 2,177, ఓపీఓలు 5,966 మందిని నియమించామన్నారు. 400 మంది మైక్రో అబ్జర్వర్లు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో పని చేస్తారన్నారు. ఓట్ల లెక్కింపు కోసం జిల్లా కేంద్రంలోని మిర్యాలగూడ రోడ్డులో గల ఎఫ్‌సీఐ గోదామ్‌లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తాం : ఎస్పీ

అనంతరం జిల్లా ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతున్నందున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు. ఎన్నికలు ముగిసే వరకు హింసాత్మక ఘటనలు జరగకుండా రాజకీయ పార్టీలు సహకరించాలని ఆమె కోరారు. ఆర్‌ఓ కేంద్రాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నామినేషన్ కేంద్రాలకు 3 వాహనాలతో పాటు నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే కార్యాలయాలలోకి అనుమతి ఉంటుందన్నారు.

‘కమలం’ టికెట్లు
మరో నాలుగు ఖరారు

- నల్లగొండ నుంచి శ్రీనివాస్‌గౌడ్, హుజూర్‌నగర్ నుంచి శ్రీలతారెడ్డి, ఆలేరులో పడాల శ్రీనివాస్, దేవరకొండ నుంచి లాలునాయక్
- పెండింగ్‌లోనే ఇంకా నాలుగు
- ఇదివరకే సూర్యాపేట, సాగర్, భువనగిరి, తుంగతుర్తి అభ్యర్థుల ప్రకటన
- మునుగోడుపై కొనసాగుతున్న సస్పెన్స్



పడాల శ్రీనివాస్



కేతావత్ లాలునాయక్



మాదగాని శ్రీనివాస్‌గౌడ్



చల్లా శ్రీలతారెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: భారతీయ జనతా పార్టీ ఉమ్మడి జిల్లాలో మరో నాలుగు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. ఈనెల 22వ తేదీన నాలుగు స్థానాల్లో పోటీలో నిలిపే అభ్యర్థులను ఖరారు చేసిన బీజేపీ గురువారం మరో నాలుగు స్థానాల్లో పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. ఇంకా నాలుగు స్థానాలను మళ్లీ పెండింగ్‌లోనే పెట్టింది. మునుగోడు నియోజకవర్గంలో ఎవరిని పోటీలో ఉంచుతారన్న దానిని సస్పెన్స్‌పెట్టింది. మరోవైపు జనసేనతో బీజేపీ పొత్తు ఉంటుందన్న సమాచారం నేపథ్యంలోనే మరో మూడింటిని పెండింగ్‌లో పెట్టిందనే చర్చ సాగుతున్నా పార్టీ అధిష్టానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ఇప్పటివరకు 8 స్థానాల్లో ప్రకటన

ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను ఇప్పటివరకు 8 స్థానాల్లో పోటీలో ఉండబోయే అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. అందులో గురువారం నాలుగు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. నల్లగొండ నుంచి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, దేవరకొండ నుంచి కేతావత్ లాలునాయక్, హుజూర్‌నగర్ నుంచి చల్లా శ్రీలతారెడ్డి, ఆలేరు నుంచి పడాల శ్రీనివాస్ పేర్లను ఖరారు చేసింది. పది రోజుల కిందట నాగార్జున సాగర్ నుంచి కంకణాల నివేదిత రెడ్డి, సూర్యాపేట నుంచి సంకినేని వెంకటేశ్వరరావు, భువనగిరి నుంచి గూడూరు నారాయణ రెడ్డి, తుంగతుర్తి నుంచి కడియం రామచంద్రయ్య పేర్లను ప్రకటించింది.

రెండోసారి లాలునాయక్

ఎల్‌ఐసీలో డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేసిన కేతావత్ లాలునాయక్ బీఆర్‌ఎస్ నుంచి 2014లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. ఇక 2018 ఎన్నికలకంటే ముందే టికెట్ కోసం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అక్కడ టికెట్ రాకపోవడంతో ఆదే ఏడాది డిసెంబరులో బీజేపీలో చేరారు. ప్రస్తుం బీజేపీ నుంచి పోటీలో ఉండబోతున్నారు.

మొదటిసారి పోటీలో శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున మాదగాని శ్రీనివాస్ గౌడ్ మొదటిసారిగా పోటీలో ఉండబోతున్నారు. ఏబీవీపీ నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన శ్రీనివాస్‌గౌడ్ నల్లగొండ జెడ్పీటీసీగా పోటీచేశారు. ఆ తరువాత తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు. ఆ తరువాత బీజేపీలో చేరారు.

తొలిసారిగా శ్రీలతారెడ్డి పోటీ

2019లో రాజకీయాల్లోకి అడుగు పెట్టిన చల్లా శ్రీలతారెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ తరువాత కౌన్సిలర్‌గా గెలుపొందిన ఆమె ఇటీవల బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉండబోతున్నారు.

శ్రీనివాస్ కూడా మొదటిసారే..

ఆలేరు నియోజకవర్గం నుంచి పడాల శ్రీనివాస్ మొదటిసారిగా బీజేపీ నుంచి పోటీచేయబోతున్నారు. అంతకుముందు బీఆర్‌ఎస్‌లో ఉన్న ఆయన 2015 నుంచి మూడేళ్లపాటు తుర్కపల్లి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షునిగా, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో బీజేపీలో చేరారు.

కోదాడ నుంచి జనసేన అభ్యర్థి!

బీజేపీ, జనసేన పొత్తుల చర్చ జరుగుతోంది. కోదాడ, మిర్యాలగూడ, నకిరేకల్ స్థానాల్లోనూ అభ్యర్థులను ఖరారు చేయలేదు. ప్రస్తుతం పవన్‌కల్యాణ్ అందుబాటులో లేనందునే వాటిని ప్రకటించలేదని, ఆయన వచ్చాక చర్చించి జనసేనకు ఇచ్చే స్థానంపై స్పష్టత తీసుకొని, మిగితా స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. జనసేనతో పొత్తు ఉంటే కోదాడ స్థానాన్ని ఆ పార్టీకి కేటాయించే అవకాశం ఉందని పార్టీ శ్రేణుల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

మునుగోడు టికెట్ చలమల్లకేనా?

మునుగోడులో టికెట్ ఎవరికి ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. రెండు జాబితాల్లోనూ మునుగోడు నుంచి ఎవరిని పోటీలో నిలుపుతుందన్న విషయాన్ని బీజేపీ తేల్చలేదు. అక్కడ పోటీలో ఉంటారని భావించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనూహ్యంగా బీజేపీని వీడి తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిపోయాయి. ఇటీవల కాంగ్రెస్ పార్టీ తరఫున మునుగోడు నుంచి రాజగోపాల్‌రెడ్డి పేరు ఖరారైంది. కాంగ్రెస్ మునుగోడు టికెట్ ఆశించిన చలమల్ల కృష్ణారెడ్డి ఈ పరిణామాలతో మనస్తాపం చెంది కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిపోయారు. మునుగోడు బీజేపీ టికెట్ కృష్ణారెడ్డికే ఇస్తారని చర్చ జరిగింది. బుధవారం ఆయన పార్టీలో చేరినా, గురువారం విడుదలైన జాబితాలో ఆయన పేరు లేదు. బుధవారం ఆయన పార్టీలో చేరే నాటికే బీజేపీ రెండో జాబితా ఖరారు పూర్తయిందని, అందుకే ఆయన పేరును ఆ జాబితాలో చేర్చలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలో ప్రకటించే మూడో జాబితాలో ఆయన పేరు ఉంటుందని పేర్కొంటున్నాయి.

గంధోత్సవం



నల్లగొండ పట్టణంలో గురువారం ప్రారంభమైన హజరత్ సయ్యద్ షా లతీఫ్ ఉల్లా ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాల్లో గంధం ఊరేగిస్తున్న ముస్లింలు, పట్టణ ప్రజలు

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీ చేసే అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ కోరారు. గురువారం తన చాంబర్‌లో ఎస్పీ అపూర్వరావుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు కేటాయించిన రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సీసీ కెమెరాలు, వీడియో చిత్రీకరణల నడుమ నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.41.22 కోట్ల సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నర్సిరెడ్డి, మెయిన్, మల్లికార్జున్, పిచ్చయ్య, లింగస్వామి, భూ సేకరణ స్పెషల్ కలెక్టర్ హరిసింగ్, డీటీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు స్థానాల్లో పోటీ

ప్రకటించిన సీపీఎం

- కాంగ్రెస్‌తో తేల్చుకోలేకపోతున్న సీపీఐ
- సీపీఐ కలిసొస్తే.. ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఉమ్మడిపోరు
- లేదంటే వేర్వేరుగానే పోటీచేసే అవకాశం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆరు స్థానాల్లో తాము పోటీలో ఉంటామని సీపీఎం ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ పొత్తుల విషయంలో ఎటూ తేల్చకపోవడం.. సీపీఎం ఇచ్చిన గడువు ముగియడంతో మార్క్సిస్టు పార్టీ ఒంటరిగా బరిలో దిగుతామని ప్రకటించింది. సీపీఐ కలిసి వస్తే ఆ పార్టీకి నాలుగు స్థానాల్లో మద్దతు ఇస్తామని సీపీఎం వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ కలిసి రాకపోతే మునుగోడు, సూర్యాపేట స్థానాల్లోనూ సీపీఎం పోటీ చేసేందుకు సిద్ధం అవుతోంది. పొత్తు విషయంలో కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న నాన్చుడు ధోరణితోనే సీపీఎం ఒంటరి పోరుకు దిగుతున్నట్లుగా తెలుస్తోంది.

ఒంటరిగా పోటీ చేసే స్థానాలివే..

కాంగ్రెస్ పార్టీతో పొత్తు తేలకపోవడంతో సీపీఎం రాష్ట్ర స్థాయిలో 17 స్థానాలతో మొదటి జాబితా ప్రకటించింది. అందులో ఉమ్మడి జిల్లాలోని మిర్యాలగూడ, నల్లగొండ, నకిరేకల్, భువనగిరి, హుజూర్‌నగర్, కోదాడ స్థానాలు ఉన్నాయి. అయితే, పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లను మాత్రం ప్రకటించలేదు. మరోవైపు సీపీఐ మునుగోడు టికెట్ ఆశించినా కాంగ్రెస్ ఇవ్వలేదు. దీంతో కాంగ్రెస్‌తో రాష్ట్ర స్థాయిలో పొత్తు కుదిరినా మునుగోడులో ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేస్తామని పేర్కొంది. అయితే ఇంకా ఆ పార్టీ వేచి చూసే ధోరణితో ఉంది. ఒకవేళ కాంగ్రెస్‌తో పొత్తు కుదరని సందర్భంలో సీపీఎంతో సీపీఐ కలిసి పోటీచేసేందుకు అంగీకరిస్తే.. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు బలంగా ఉన్న స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంది.

పొత్తు కుదిరితే..

సీపీఎం, సీపీఐ మధ్య పొత్తు కుదిరితే మునుగోడు, దేవరకొండ, ఆలేరు, కోదాడ స్థానాల్లో సీపీఐ పోటీచేసే అవకాశం ఉంది. అక్కడ సీపీఐకి సీపీఎం మద్దతు ఇవ్వనుంది. ఒకవేళ రెండు పార్టీలు వేర్వేరుగా పోటీచేయాలనుకుంటే మాత్రం ప్రస్తుతం ప్రకటించిన స్థానాలతో పాటు మునుగోడు, సూర్యాపేట నియోజకవర్గాల్లోనూ పోటీ చేయాలని సీపీఎం భావిస్తోంది.

● నాడు ప్రత్యర్థులు.. నేడు జట్టుగా కదిలారు!


ప్రచార రథంపై భిక్షమయ్యగౌడ్, గొంగిడి సునీత, కల్లూరి రామచంద్రారెడ్డి

ఆలేరు నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున గొంగిడి సునీత, కాంగ్రెస్ నుంచి బూడిద భిక్షమయ్య గౌడ్, బీఎస్పీ అభ్యర్థిగా కల్లూరి రామ చంద్రారెడ్డి బరిలో నిలుచున్నారు. ప్రస్తుతం బూడిద భిక్షమయ్యగౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి బీఆర్ఎస్‌లో చేరి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గొంగిడి సునీత తరఫున ప్రచారం నిర్వహిస్తున్నారు. వారు ముగ్గురు గురువారం ఆలేరు నియోజకవర్గంలోని ఆత్మకూరు (ఎం) మండలంలో ఒకే ప్రచార రథంపై నుంచి ప్రచారం చేయడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– ఆత్మకూరు(ఎం)

ఎన్నికల పరిశీలకులు వస్తున్నారు

● జనరల్, పోలీసు అబ్జర్వర్లను నియమించిన ఎలక్షన్ కమిషన్

నల్లగొండ క్రైం: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాలకు జనరల్, పోలీస్ అబ్జర్వర్లను నియమిస్తూ గురువారం ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జనరల్ పరిశీలకులుగా ఐఏఎస్ అధికారులను, పోలీసు అబ్జర్వర్లుగా ఐపీఎస్ అధికారులను నియమించారు. వీరంతా నవంబర్ 10 నుంచి డిసెంబరు 3 వరకు వారికి కేటాయించిన నియోజకవర్గాల్లో ఎన్నికల నియమావళి అమలును పర్యవేక్షిస్తారు.

◆ **జనరల్ అబ్జర్వర్లు..**

ఆర్. కన్నన్ – నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాలు
అవినాష్ చంపావట్ – నల్లగొండ, మిర్యాలగూడ నియోజకవర్గాలు
కె.బాలసుబ్రహ్మణ్యం – నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాలు
ఎ.కౌసిగన్ – హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలు
బాలకిషన్ ముండా – సూర్యాపేట, తుంగతుర్తి
సీఎన్.మహేశ్వరన్ – భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలు

◆ **పోలీసు అబ్జర్వర్లు**

వినీత్ ఖన్నా – దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్
విజయ్‌సింగ్ మీనా – నకిరేకల్, మునుగోడు, నల్లగొండ
ఫర్హత్ అబ్బాస్ – కోదాడ, సూర్యాపేట, హుజూర్‌నగర్, తుంగతుర్తి
హెచ్. తంగులియన్ గంగ్టే – భువనగిరి, ఆలేరు

జంగ్ తెలంగాణ

సందేహాలను నివృత్తి చేయాలి

ఆలేరు : ఎన్నికల అధికారులు రిటర్నింగ్ కార్యాలయాల్లో అందుబాటులో ఉండి నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చిన అభ్యర్థులకు సహకరించాలని ఆలేరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ), అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. గురువారం ఆలేరులోని రిటర్నింగ్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ పత్రాలను తప్పులు లేకుండా పూరించడంతో పాటు అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. సమావేశంలో ఏసీపీ శివరాంరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జ్ఞాన ప్రకాష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థుల ప్రొఫైల్

ఆలేరు నియోజకవర్గం: పడాల శ్రీనివాస్
పుట్టిన తేదీ: 06–07–1972
స్వగ్రామం: తుర్కపల్లి
తల్లిదండ్రులు: పడాల చంద్రం, సులోచన.
భార్య: విజయ
పిల్లలు: శ్రీవైష్ణ, కృష్ణ కౌశిక్
విద్యార్హత: బ్యాచ్‌లర్ ఆఫ్ ఇంజనీరింగ్, ఎంబీఏ
వృత్తి: రాజకీయం, బిజినెస్

దేవరకొండ : కేతావత్ లాలునాయక్
పుట్టిన తేదీ: 07–03–1965
సొంతూరు: పెద్దమునిగల్, నేరేడుగొమ్ము మండలం
తల్లిదండ్రులు: గుండ్యానాయక్, నాజీ
భార్య: లక్ష్మీ
కుమారులు: నవీన్‌కుమార్, క్రాంతికుమార్
విద్యార్హత: బీఏ

నల్లగొండ : మాదగాని శ్రీనివాస్‌గౌడ్
తండ్రి పేరు: రామశెట్టి
పుట్టిన తేదీ: 18–05–1971
విద్యార్హతలు: ఎంఏ (పరిపాలన శాస్త్రం)
ప్రస్తుత నివాసం: ఓల్డ్ వీటీ కాలనీ, నల్లగొండ
వృత్తి: కాకతీయ విద్యాసంస్థల చైర్మన్

హుజూర్‌నగర్ : చల్లా శ్రీలతారెడ్డి
పుట్టిన తేదీ: 26–10–1973
పుట్టిన ఊరు: నేరేడుచర్ల
తల్లిదండ్రులు: పోరెడ్డి సుకథ, శ్రీరాంరెడ్డి
భర్త: చల్లా విజయ్‌భాస్కర్‌రెడ్డి
విద్యార్హత: ఎంఏ, ఎల్‌ఎల్‌బీ

అప్పట్లో ఎన్నికల ఖర్చు రూ.60 వేలే!

‘ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన కార్యకర్తలు, నాయకులకు సమయానికి భోజనాన్ని మాత్రమే ఏర్పాటు చేసే వాళ్లం. అంతకుమించి ఎలాంటి ఖర్చులు ఉండేవి కావు. ప్రచారంలో నేను స్కూటర్, జీపు వాడాను. కార్యకర్తలు సైకిళ్లపై గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించేవారు. ఇప్పటి మాదిరిగా ఓట్ల కొనుగోలు, సభలు, సమావేశాలకు రూ.లక్షలు ఖర్చు చేయలేదు. నేను తొలిసారి పోటీ చేసినప్పుడు రూ.60 వేల ఖర్చయ్యింది. చిత్తశుద్ధితో పనిచేస్తామని చెప్పడంతోనే ప్రజలంతా నమ్మి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు.’ అని మాజీ మంత్రి గుత్తా మోహన్‌రెడ్డి చెప్పారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి గతంలో, ప్రస్తుత ఎన్నికల తీరుపై ‘సాక్షి’తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- మూడ వేణు, చిట్యాల


గుత్తా మోహన్‌రెడ్డి
మాజీ మంత్రి

నేను ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు 1969లో తెలంగాణ తొలిదశ ఉద్యమం మొదలైంది. విద్యార్థులను ఏకం చేస్తూ నాయకత్వం వహించాను. ఈ క్రమంలో అప్పటి తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) నాయకుడు మర్రి చెన్నారెడ్డితో నాకు ఏర్పడిన పరిచయంతో 1972లో టీపీఎస్ తరఫున పనిచేశాను. ఆ సమయంలో జరిగిన నల్లగొండ పార్లమెంట్ (1972) ఎన్నికల్లో టీపీఎస్ ఎంపీ అభ్యర్థి రామకృష్ణారెడ్డి గెలుపునకు కృషిచేశాను. అనంతరం 1973లో నల్లగొండలోని ఎన్‌జీ కాలేజీలో జువాలజీ అధ్యాపకుడిగా విధుల్లో చేరాను.

● కార్యకర్తలకు భోజనం మాత్రమే పెట్టేవాళ్లం ● స్కూటర్లు, సైకిళ్లపైనే ప్రచారం చేసేవాళ్లం
● కేవలం చిత్తశుద్ధితో పనిచేస్తామని చెప్పేవాళ్లం ● ఎప్పుడూ ఓట్లు కొనుగోలు చేయలేదు
● ప్రస్తుతం ఎన్నికలు డబ్బు మయం అయ్యాయి ● నిజాయితీపరులను ఎన్నుకోవాలి
● ప్రజాసేవకు యువత రాజకీయాల్లోకి రావాలి ● ‘సాక్షి’తో మాజీ మంత్రి గుత్తా మోహన్‌రెడ్డి

ఖర్చు భరించలేక ..

నేను మూడు సార్లు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచాను. మొదట 1978లో పోటీచేసినప్పుడు నా ఎన్నికల ఖర్చు రూ.60 వేలు దాటలే. రెండోసారి 1983లో పోటీచేసినప్పుడు ఖర్చు లక్ష రూపాయల వరకు వచ్చింది. ఆ వెంటనే 1985లో అసెంబ్లీకి ఎన్నికలు వచ్చాయి. మూడోసారి పోటీచేసిన నేను లక్షా 40వేల రూపాయలు ఖర్చు చేశాను. క్రమంగా ఖర్చు పెరిగిపోతుండడంతో దానిని భరించలేక ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నా. 1978లో జరిగిన ఎన్నికల్లో అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ చేత నల్లగొండలోని బాలుర జూనియర్ కాలేజీలో వేలాది మందితో బహిరంగ సభను నిర్వహించాను. ఆ ఎన్నికల్లో నాకు పార్టీ అందజేసిన ఐదు వేల రూపాయల పార్టీ ఫండ్‌తో పాటు నా దగ్గర ఉన్న కొంత నగదును కలిపి ఎన్నికల ప్రచారం నిర్వహించాను.

నా భూమి పేదలకు పంచాను

నేను రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదు. అక్రమ ఆస్తులను సంపాదించలేదు. నాకున్న వ్యవసాయ భూమిని గతంలో కొంత భాగం గ్రామంలోని పేదలకు పంచాను. మిగిలిన భూమిలో వ్యవసాయం చేస్తున్నా. ప్రస్తుతం రాజకీయాల్లోకి బడా వ్యాపారవేత్తలు రావటంతో ఎన్నికలు డబ్బుమయం అయ్యాయి. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలకు న్యాయం జరగాలంటే విద్యావంతులు నిజాయితీ పరులను, ప్రజల మేలు కోసం పనిచేసే నాయకులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలి. ప్రజలకు సేవ చేసేందుకు నేటి యువత రాజకీయాల్లోకి రావాలి.

రెండుసార్లు నల్లగొండ ఎమ్మెల్యేగా..

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ఉన్న మర్రి చెన్నారెడ్డి సూచన మేరకు నేను అధ్యాపక వృత్తికి స్వస్తి పలికి 1978 శాసనసభ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచాను. జనతా పార్టీ అభ్యర్థి చకిలం శ్రీనివాసరావుపై ఎనిమిది వేల ఓట్ల అధిక్యంతో విజయం సాధించాను. 1983లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాకు టికెట్ నిరాకరించటంతో ఇండిపెండెంట్‌గా పోటీచేసి విజయం సాధించాను. ఆ తర్వాత టీడీపీలో చేరాను. అప్పటి రాజకీయ పరిణామాల్లో సీఎంగా నాదెండ్ల భాస్కర్‌రావు ఎన్నికైన సమయంలో ఆయన కేబినెట్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కొంతకాలం పనిచేశాను.

తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా..

1998లో బీజేపీ ఒక ఓటు రెండు రాష్ట్రాల ప్రతిపాదన చేయడంతో ఆకర్షితుడినై ఆ పార్టీలో చేరాను. ఆ తర్వాత 2000 మార్చిలో కేసీఆర్ చేపట్టిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భాగస్వామ్యమై ఆనాటి పార్టీ ఏర్పాటు, ఉద్యమ సమావేశాల్లో పాల్గొన్నా. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నాను.

గ్రామాల్లో విద్యుత్ వెలుగులు..

నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నల్లగొండ నియోజకవర్గంలోని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాను. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఏర్పాటుకు ప్రతిపాదన, మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, నల్లగొండ మీదుగా రైల్వే లైన్, బీటీ రోడ్లు ఏర్పాటు చేయించాను.

ఎమ్మెల్యేలుగా తండ్రీకొడుకులు

మిర్యాలగూడ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలువురు తండ్రీకొడుకులు ఎమ్మెల్యేలుగా గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టారు.

నాగార్జునసాగర్‌లో 2018 ఎన్నికల్లో నోముల నర్సింహయ్య టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి జానారెడ్డిపై గెలుపొందారు. 2020 డిసెంబర్‌లో ఆయన అనారోగ్యంతో మృతిచెందగా 2021 ఏప్రిల్‌లో జరిగిన ఉప ఎన్నికలో నర్సింహయ్య కుమారుడు నోముల భగత్‌కు టీఆర్ఎస్ అధిష్టానం టికెట్ కేటాయించడంతో ఆయన కుందూరు జానారెడ్డిపై పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో జానారెడ్డి కుమారుడు కుందూరు జైవీర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా, బీఆర్ఎస్ నుంచి నోముల భగత్ తలపడుతున్నారు.

నాగార్జునసాగర్‌లో ‘నోముల’


నోముల నర్సింహయ్య


నోముల భగత్


తిప్పన చినకృష్ణారెడ్డి


తిప్పన విజయసింహారెడ్డి

మిర్యాలగూడలో ‘తిప్పన’

మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి తిప్పన చినకృష్ణారెడ్డి 1962, 1967, 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. 1979లో తిప్పన చినకృష్ణారెడ్డి మృతిచెందగా ఆయన రాజకీయ వారసత్వాన్ని ఆయన కుమారుడు తిప్పన విజయసింహారెడ్డి కొనసాగించారు. విజయసింహారెడ్డి మొదట కాంగ్రెస్ పార్టీ నుంచి ఉమ్మడి ఆలగడప గ్రామ పంచాయతీ నుంచి సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించారు. 1989 అసెంబ్లీ ఎన్నికల్లో మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన విజయసింహారెడ్డి సీపీఎం అభ్యర్థి అరిబండి లక్ష్మీనారాయణపై గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టారు.

మునుగోడులో ‘ఉజ్జిని’

మునుగోడు నియోజకవర్గంలో 1985 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా ఉజ్జిని నారాయణరావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం. నారాయణరావుపై గెలుపొందారు. ఆ తర్వాత 1989, 1994 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి గోవర్ధన్ రెడ్డిపై కూడా విజయం సాధించారు. కాగా ఉజ్జిని నారాయణరావు కుమారుడు ఉజ్జిని యాదగిరిరావు 2009 ఎన్నికల్లో సీపీఐ నుంచి మునుగోడు నుంచే పోటీ చేసి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డిపై గెలుపొందారు.


ఉజ్జిని నారాయణరావు


ఉజ్జిని యాదగిరిరావు

కల్తీ మద్యాన్ని కట్టడి చేస్తాం

నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లాలో మద్యం అక్రమ రవాణాతో పాటు కల్తీ మద్యాన్ని కట్టడి చేసేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి బి. సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం కల్తీదా.. సరైందా అనే విషయాన్ని నిర్ధారణ చేసేందుకు వీఈఆర్ఐటీ మొబైల్ యాప్ ద్వారా స్కాన్ చేసి తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. బాటిల్ మూతపై గల హోలోగ్రామ్‌ను స్కాన్ చేయగానే ఆ బాటిల్ బ్రాండ్, పరిమాణం, ఎంఆర్‌పీ బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, జారీ చేయబడిన డిపో, వైన్ షాపు పేరు తెలుస్తాయని తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు, నిల్వల సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 18004252523కు కంట్రోల్ రూం నంబర్ 08682–224271కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పకడ్బందీగా అమలు చేయాలి

సూర్యాపేట: ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ అధికారి అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్తీ మద్యం, మద్యం అక్రమ రవాణా, నిల్వలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు, సమాచారం తీసుకునేందుకు ఎక్సైజ్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 18004252523కు కాల్ చేయాలని కోరారు. మద్యం కల్తీదా, సరైనదా తెలుసుకొనుటకు వీఈఆర్ఐటీ మొబైల్ యాప్ ద్వారా స్కాన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

నడిగూడెంలో రూ.8లక్షలు పట్టివేత

నడిగూడెం: ఎన్నికల కోడ్‌లో భాగంగా గురువారం నడిగూడెం పోలీసులు బరాఖత్‌గూడెం రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో మిర్యాలగూడ మండలం తడకమళ్లకు చెందిన ఢీకొండా గంగయ్య తన కారులో రూ.8లక్షల నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

సూర్యాపేటలో రూ 2,47,900..

సూర్యాపేట క్రైం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సూర్యాపేటలో గురువారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ 2,47,900 నగదు పట్టుబడిందని సీఐ రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని హైటెక్ బస్టాండ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఏపీలోని భీమవరానికి చెందిన మురళీకృష్ణరాజు వద్ద రూ 66,900లు, కోదాడకు చెందిన నాగరాజు వద్ద రూ.92 వేలు, బేగంపేటకు చెందిన యలమంచలి దుర్గాదేవి వద్ద రూ.89 వేలను సరైన ఆధారాలు చూపనందున స్వాధీనం చేసుకుని అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.

జాతీయ నైపుణ్య శిక్షణకు రేపు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపిక

నల్లగొండ రూరల్: నల్లగొండ పరిధిలోని అన్నెపర్తిలో గల మహాత్మాగాంధీ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈనెల 4న జాతీయ సమైక్యత శిబిరానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేయనున్నట్టు ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్, హిందీ, నాయకత్వ లక్షణాలు, కల్చరల్ అంశాల్లో ప్రతిభ కనబరిచే వారిని ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వలంటీర్లు ఈనెల 22 నుంచి 28 వరకు కర్ణాటక యూనివర్సిటీలో జరిగే జాతీయ నైపుణ్య శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు.

కల్వర్టును ఢీకొట్టి కారు దగ్ధం

కొండమల్లేపల్లి: నేరెడుగొమ్ము మండలం వైజాక్‌కాలనీ నుంచి గురువారం తెల్ల వారుజామున హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ కారు పెండ్లిపాకల వద్ద ఉన్న మూలమలుపు వద్ద కల్వర్టును ఢీకొట్టింది. దీంతో షార్ట్ సర్క్యూట్ జరిగి కారులో మంటలు చెలరేగాయి. అందులో ఉన్న ఆరుగురు బయటికి దిగారు. కారు పూర్తిగా దగ్ధమైంది. కాగా.. కారు డ్రైవర్ వంశీకృష్ణ హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ వాసి. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని కొత్త గుండ్లపల్లిలో గురువారం ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపల్లిలో గల కంబాల చిన్న మల్లయ్య ఇంట్లో మధ్యాహ్నం ఫ్రిడ్జి వైర్లు ఒకదానికి ఒకటి తాకడంతో షార్ట్ సర్క్యూట్ అయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న చిన్న మల్లయ్య భార్య తన కుమార్తెను తీసుకొని బయటకు కేకలు వేస్తూ వచ్చింది. స్థానికులు గమనించి ఇంటిపై ఉన్న పెంకులను తీసి ఫైరింజన్ సిబ్బంది సాయంతో మంటలు ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధమైందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

కొత్తలాపురంలో బత్తాయి తోట..

గుర్రంపోడు: ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్‌సర్క్యూట్‌కు గురికావడంతో మంటలు చెలరేగి గుర్రంపోడు మండలం కొత్తలాపురం గ్రామంలోని కిలారి రామలింగయ్యకు చెందిన రెండు ఎకరాల బత్తాయి తోట దగ్ధమైంది. తోటలో 40 చెట్లు పూర్తిగా కాలిపోగా మరికొన్ని పాక్షికంగా కాలిపోయాయి. అంతరపంటగా కూరగాయల సాగుకు వేసిన డ్రిప్ కూడా పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.4లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు.

సిమెంట్ పరిశ్రమలో లోడర్ ఢీకొని వ్యక్తి మృతి

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని ఓ సిమెంట్ పరిశ్రమలో లోడర్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ యాదవ్ వివరాల ప్రకారం.. పరిశ్రమ ఉద్యోగి అయిన మన్నె సుబ్బారావు (58) ఉదయం డ్యూటీలో ఉన్నాడు. 7 గంటల సమయంలో కోల్ మిల్ పరిసరాల్లో పనిచేస్తుండగా పరిశ్రమకు చెందిన లోడర్ ఢీకొట్టింది. గాయపడిన అతడిని వైద్యం కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. భూక్యా నగేష్ అనే వ్యక్తి లోడర్‌ను అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే మృతి చెందాడని సుబ్బారావు కోడలు సాయిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ఆత్మకూర్ మండల పరిధిలోని నెమ్మికల్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మద్దిరాల మండల కేంద్రానికి చెందిన నాగిళ్ల కుమారి సూర్యాపేటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆటో ఎక్కింది. నెమ్మికల్ శివారుకు రాగానే ఆటో అతివేగంగా వెళ్తూ ఒక్కసారిగా కటింగ్ ఇవ్వడంతో కుమారి రోడ్డుపై పడి తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి భర్త సంజీవ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు.

క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతాయి

ఎంజీయూ (నల్లగొండ రూరల్): క్రీడలు పోటీతత్వాన్ని పెంచుతాయని ఎంజీయూ క్రీడల కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంజీయూ క్యాంపస్‌లో బాస్కెట్‌బాల్ యూనివర్సిటీ మహిళా, పురుషుల జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన విద్యార్థులు అంతర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న క్రీడల కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి

రుణం తీసుకోకున్నా తీసుకున్నట్లు నోటీసులు

● సహకార సంఘం ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి మహిళ ఆందోళన

నడిగూడెం: రుణం తీసుకోకున్నా తీసుకున్నట్లు బ్యాంకు నుంచి నోటీసు వచ్చిందని, సంబంధిత అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం నడిగూడెం మండలం తెల్లబల్లి సహకార సంఘం ఎదుట మహిళ కుటుంబంతో సహా ఆందోళనకు దిగింది. తెల్లబల్లి గ్రామానికి చెందిన బాధితురాలు ధనలక్ష్మి భర్త కొల్లు గోవిందరాజులు మాట్లాడుతూ 2017 మార్చిలో తమ పేరిట అప్పటి సీఈఓ సంబంధిత కార్యాలయ సిబ్బందితో కుమ్మక్కై రూ.60 వేలు రుణం తీసుకున్నారని ఆరోపించారు. దీంతో సంబంధిత బ్యాంకు అధికారులు రుణం డబ్బులు వడ్డీతో సహా చెల్లించాలని, తమను మొండి బకాయి రైతు జాబితాలో ప్రకటించారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


తెల్లబల్లి సహకార సంఘం ఎదుట కుటుంబ సభ్యులతో ఆందోళన చేస్తున్న ధనలక్ష్మి

కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఆత్మహత్య

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన షేక్ బాషిత్ (36) వృత్తి రీత్యా గాలిమిషన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన భాషిత్ ఇంట్లో ఉన్న బాత్ రూంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోదరి బాత్ రూం తలుపు తీస్తుండగా రాకపోవడంతో తల్లిదండ్రులకు తెలిపింది. వారు ఇరుగు పొరుగు వారి సహకారంతో తలుపు తెరిచి చూడగా అప్పటికే బాషిత్ మృతి చెందాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.


షేక్ భాషిత్ (ఫైల్)

ఘనంగా క్రైస్తవుల ఆత్మల పండుగ

మఠంపల్లి: మఠంపల్లిలోని శ్మశాన వాటికలో గురువారం క్రైస్తవులు ఆత్మల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా విచారణ గురువులు మార్టిన్, రజినీరెడ్డిలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు తమ బంధువుల సమాధులను రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక చర్చి కమిటీ పెద్దలు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.


క్రైస్తవుల శ్మశాన వాటికలోని సమాధులను పూలతో అలంకరిస్తున్న బంధువులు

నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఎంసీపీఐ(యూ) పోటీ

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఎంసీపీఐ(యూ) అభ్యర్థులు పోటీ చేస్తారని పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ నజీర్ తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి వస్కూల మట్టయ్యతో కలిసి మాట్లాడారు. ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌తో కలిసి పోటీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మోరపాక ఉగ్రయ్య, నలుగురి రమేష్, వేముల పెద్ద నరసయ్య, వీర పాపయ్య, వస్కూల సైదమ్మ, వరికుప్పల వెంకన్న పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER
■ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్ డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468 [H-788343]

Real Estate

VILLA FOR SALE
■ Ready to Occupy Duplex Luxury 3BHK-2340 Sft Villas In the Best Gated Community At Miryalaguda, Next to New D Mart, Club House, Swimming pool, Fully, Fully Operational Must See 7013578378 [H-193240]

Wanted
■ కొత్తగా ప్రారంభించిన మా కంపెనీలో జాబ్ చేయుటకు 34 ఫ్రీ/పులు కావలెను. జీ: 14 వేలు+ 6వేలు DA+ ఫ్రీ రూం. Q:10th, ఇంటర్ (P/F) నల్లగొండ. సెల్: 85198 91505 [L-781101]

■ ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ అ.కా.ను. అ: ఇంటర్, డిగ్రీ జీ: 17K to 35K ఇంట్రెస్ట్ ఉన్న వారు వెంటనే డీటేల్స్ వాట్సాప్ చేయండి. 9885426966 [H-193239]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం: 18K Ph: 9848571888/9640400073 [H-189348]

■ రామకృష్ణ గ్రూపు, (TS No.1) VJA, HYD శ్రీమంతులఇళ్లలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 96038 92233, 62812 08600 [B-1206460]

ప్రకటన గోరంతో! స్పందన కొండంతో!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740, 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి చిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.